క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో విధులు నిర్వహించే సిబ్బంది, రూట్ అధికారులకు ఈవీఎంల వినియోగంపై ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్వో మండల అప్పారావు అవగాహన కల్పించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం, వీవీపాట్స్‌పై పీఓ, ఏపీఓ, సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, రూట్ అధికారులపై ఆ బాధ్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధుల్లో భాగస్వాములై ఈవీఎంలపై అవగాహన పొందాలని సూచించారు. పోలింగ్ సమయంలో సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

6న నీలమణిదుర్గ ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ ఆలయ హుండీని ఈ నెల 6వ తేదీ ఉదయం పది గంటల నుంచి లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. లెక్కింపునకు వచ్చిన భక్తులు డ్రెస్ కోడ్ పాటించాలని కోరారు. గ్రామ పెద్దలు, భక్తులు హాజరుకావాలన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామ అసిరితల్లి ఆలయ 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బంకుపల్లి వెంకటసత్యగోపాలరావు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామ మహిళలు ఘటాలతో ముర్రాటలు చెల్లించారు. అమ్మవారి ఆలయం ఆవరణలో నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

- పాతపట్నం నియోజకవర్గం ఆర్వో అప్పారావు



పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గానికి పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని ఆర్వో ఎం.అప్పారావు శుక్రవారం తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఈ నెల 4 నుంచి 7 వరకు ఎన్నికల్లో (ఫామ్–12) తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అత్యవసర సేవలకు సంబంధించి ఓటర్ల కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. 4న పీఓలు, ఏపీఓలు, ఇతర టీమ్‌లు, 5వ తేదీన ఓపీఓలు, ఇతర టీమ్‌లు, 6వ తేదీన పోలీసులు, సెక్టార్ అధికారులు, ఈస్సెంటిల్ సర్వీసెస్, డ్రైవర్లు, ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లు, 7వ తేదీన పోలీసులు, ఈస్సెంటిల్ సర్వీసెస్, ఎలక్షన్‌లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని ఆర్వో తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ల పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్లను ఆర్వో అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లను, కవర్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని వేగంగా పూర్తిచేసి, ఆయా ప్రాంతాలకు పోస్టల్ బ్యాలెట్లను త్వరగా పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో ప్రసాదరావు, డీటీలు వెంకటరమణ, ప్రసాదరావు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలతో వలంటీర్లు

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పది మంది గ్రామ వలంటీర్లు తమ విధులకు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.



ఆర్టీసీలో విలీన వెలుగులు

- ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన సీఎం జగన్
- హామీకి కట్టుబడి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసిన వైనం
- 2017 పీఆర్‌సీ ఎరియర్స్, 2020–21 లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నిధులు విడుదల

డిపో	ఉద్యోగులు
శ్రీకాకుళం–1	359 మంది
శ్రీకాకుళం–2	379 మంది
టెక్కలి	284 మంది
పలాస	337 మంది
డీపీటీవో ఆఫీస్	29 మంది
మొత్తం ఉద్యోగులు	1388 మంది

శ్రీకాకుళం అర్బన్ : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న డిమాండ్‌ను గత ప్రభుత్వాలు విస్మరించాయి. ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి జిల్లాలో 1388 మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఆరు నెలలలోపే దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విలీన ప్రక్రియను పూర్తి చేసి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చడంతో పాటు జీతభత్యాలు కూడా ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అందిస్తున్నారు. ఆర్టీసీ సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారు.

బాబు హయాంలో జీతాలు కట్..

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు చాలక అనేక ఇబ్బందులు పడేవారు. చంద్రబాబు హయాంలో సమ్మెలు, పోరాటాలు చేసినా తగిన ఫలితం దక్కలేదు. దీనికితోడు కార్మికులను వేధించి సమ్మె కాలానికి జీతాలను కట్ చేసి ఉక్కుపాదం మోపేది. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్టీసీ కార్మికులుగా ఉన్న తాము ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతో సమస్యలకు పరిష్కారం లభించిందని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టంచన్‌గా జీతాలు..

కరోనా వంటి సమయంలో లాక్‌డౌన్ కారణంగా శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం 1, శ్రీకాకుళం 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోలలో బస్సులన్నీ రోడ్లపైకి రాక ఆయా డిపోలకే పరిమితమయ్యాయి. అటువంటి పరిస్థితులలో కూడా ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం 1వ తేదీ నాటికే వైఎస్సార్ ప్రభుత్వం టంఛన్‌గా జీతాలు చెల్లించారు. ఇలా జీతాలు చెల్లించడం దేశ చరిత్రలో మొట్టమొదటిసారి అని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు లబ్ధి..

ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్‌సీ ఎరియర్స్‌కు సంబంధించి 25 శాతం చొప్పున రెండు విడతలుగా నగదు జమ అయ్యింది. 2020–21 లీవ్ ఎన్ క్యాష్ క్యాష్‌మెంట్‌కు సంబంధించి నిధులు కూడా విడుదలయ్యాయి. దీంతో ఒక్కో ఆర్టీసీ ఉద్యోగికి కేటగిరీ బట్టి సుమారు రూ.40 వేలు నుంచి రూ.లక్ష వరకూ లబ్ధి చేకూరింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల ఇప్పట్లో పీఆర్‌సీ ఎరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అందదని అనుకున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఒక్కసారిగా నగదు అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పథం సంక్షేమ రథం

నిర్భయంగా ఓటేయండి



మెళియాపుట్టి: మెళియాపుట్టిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పాతపట్నం సీఐ నల్లి సాయి అన్నారు. మండలంలోని మెళియాపుట్టి, గొప్పిలి, చీపురుపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు గురికావొద్దని, ప్రలోభాలకు భయపడొద్దని, పటిష్ట భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో నిత్యం పోలీస్ నిఘా ఉంటుందన్నారు. స్థానిక ఎస్సై రాజేష్, పలువురు పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని ఉప్పినివలస, లచ్చయ్యపేట, కొల్లివలస, తోటవాడ, అయ్యవారిపేట గ్రామాల్లో స్థానిక ఎస్సై జి.వి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రజలకు అప్రమత్తం చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తగాదాలు, కొట్లాటలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలతోపాటు ప్రజలు కూడా నిబంధనలు అతిక్రమించకుండా ఉండాలని సూచించారు. రాత్రి వేళలో కొల్లివలస, తోటవాడ, అయ్యవారిపేట గ్రామాల్లో సమావేశం నిర్వహించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.



బూర్జ: ఉప్పినివలసలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చంద్రబాబు కుట్రలతోనే ఇబ్బందులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: చంద్రబాబు చేసిన కుట్రల వల్లే అవ్వాతాతలు, పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెల్లవారుజామునే అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేసేదన్నారు. చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసమే అవ్వాతాతలకు ఇబ్బంది పెట్టారన్నారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో కేవలం 10 శాతం కూడా అమలు కాలేదన్నారు. మరోసారి అమలు చేయలేని హామీలను చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించారని, వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. హామీలన్నింటినీ అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి ప్రజలందరూ మద్దతు తెలపాలన్నారు. ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

కొత్తూరు: ఉపాధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని మెట్టూరు బిట్–2, దిమిలి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. చెరువులో మట్టిని గట్లుపై ఇష్టానుసారంగా వేయడం వల్ల వర్షాలు కురిసిన వెంటనే మట్టి చెరువులోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయండి

పాతపట్నం: ఈ నెల 4వ తేదీ సాయంత్రం మూడు గంటలకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ శుక్రవారం తెలిపారు. బైక్ ర్యాలీలో పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొంటారన్నారు. బైక్ ర్యాలీ పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమై బూరగాం, కాగువాడ, కొరసవాడ, సీది కూడలి మీదుగా సీది, పాశీగంగుపేట, సోద, సున్నాపురం, బైదలాపురం, ఎ.ఎస్.కవిటి, చాకిపల్లి, అనంతగిరి, ఆర్.ఎల్.పురం, రొంపివలస, రొమదల గ్రామాలతో పాటు మరో 17 గ్రామాల్లో ఉంటుందన్నారు. బైక్ ర్యాలీలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రదీప్ కోరారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి



సరుబుజ్జిలి: కొండవలసలో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- పార్టీ అభ్యర్థులు తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి
- ప్రచారానికి విశేష స్పందన



ఆమదాలవలస: చంద్రయ్యపేటలో ప్రచారం చేస్తున్న చిరంజీవినాగ్

సరుబుజ్జిలి: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి అందరూ బాసటగా నిలవాలని స్పీకర్, ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం కోరారు. మండలంలోని కొండవలస, రావివలస, పెదవెంకటాపురం, వీరమల్లిపేట, పెద్దసవలాపురం, సింధువాడ, బురిడివలస, షళంత్రి, కొత్తకోట, కొండ్రగూడ, అవతరాబాద్, రొట్టవలస గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనను ఎమ్మెల్యేగా, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్, కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడు కొవిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, జేసీఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు.అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, నూలు ఈశ్వరరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, వీవర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన స్పీకర్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంను గెలిపించాలని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు ఓటర్లను కోరారు. మండలంలోని తోటాడ, అక్కివరం గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్‌లు మెట్ట శారద, ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మి, గురుగుబెల్లి నీలారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు: గిరిజన పక్షపాతి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, మరోసారి వైస్సార్‌సీపీని గెలిపించాలని కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ కోరారు. మండలంలోని ఇరపాడు గూడ గిరిజన గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతపట్నం ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిని, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్లంకి ధర్మారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సంక్షేమం, అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అభ్యర్థించారు. మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు చంద్రయ్యపేట, లక్ష్మీనగర్, రెడ్డి క్వార్టర్స్, పోలపోలమ్మవారి వీధుల్లో ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, బి.వి.రమణమూర్తి, డి.చిరంజీవిరావు, పాల్గొన్నారు.

ప్రచార పర్వం



పాతపట్నం: కొరసవాడలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: తోటాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల నాయకులు



కొత్తూరు: ఇరపాడుగూడలో ప్రచారం నిర్వహిస్తున్న చింతాడ సూర్యనారాయణ

అడుగడుగునా.. జన నీరాజనం

హిరమండలం: ఎన్నికల ప్రచారంలో భాగంగా హిరమండలం మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించిన బైక్‌ర్యాలీలో జగన్ నినాదం మిన్నంటింది. ప్రత్యర్థి రాజకీయ పార్టీల్లో దడ పుట్టించింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. జై జగన్ నినాదాలతో మండలంలోని ధనుపురం నుంచి కల్లట, చొర్లంగి, గొట్టా, దుర్బలాపురం, కొండరాగోలు, గులుమూరు, నొగూడ, సుభలయ, బ్యారేజీ సెంటర్, హిరమండలం, పాతహిరమండలం వరకు ర్యాలీ సాగింది. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రచార రథాన్ని నడుపుతూ బైక్ ర్యాలీని ధనుపురంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే తనయులు శ్రావణ్, ఓంశ్రీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో అర్హతే ప్రమాణికంగా జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిని, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీల్లో ఘన స్వాగతం..

కొత్తూరు: మండలంలోని దాసరథీపురం, కాశీపురం, మెట్టూరు బిట్–1, 2, 3 ఆర్అర్ కాలనీలతోపాటు 18 గ్రామాల్లో పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు మద్దతుగా నిర్వహించిన బైక్ ర్యాలీకి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. మెట్టూరు, గూనభద్ర నిర్వాసిత కాలనీ వాసులు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు హారతలిస్తూ నీరాజనం పలికారు. కిలో మీటర్ల పొడువున వేలాది బైక్‌లతో కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి, పేరాడ తిలక్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపిలించాలని కోరారు. కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, ఎంపీపీ సవర సావిత్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొత్తూరు: నీలకంఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



హిరమండలం:గొట్టా బ్యారేజ్ బ్రిడ్జిపై బైక్ ర్యాలీ



కొత్తూరు: దశరథీపురం కూడలి వద్ద ఆహ్వానం పలికేందుకు సిద్ధంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



హిరమండలం: ధనుపురం వద్ద ప్రచార రథం నడుపుతూ బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: ప్రచారం చేస్తున్న రెడ్డి శ్రావణ్, ఓంశ్రీకృష్ణ